


ఎండ మండిపోతోంది. మధ్యాహ్నం మూడు గంటలకూడా సముద్రపు టొడ్డున వున్న రోడ్డుమీద చల్లగాలి తిరగ లేదు. కారులో కూర్చుంటే ఒకటే తెక తెక. సముద్రుడు మోతపెడుతూ, అలల్ని విసిరి కొడుతున్నాడా, లేక నిద్ర పోతున్నాడా అనే అనుమానం కలిగి, సీను కారు తలుపుమీద చెయ్యి ఆనించి ముందుకు వొంగాడు. ఎండకు వేడెక్కిన కారుతలుపు చుర్రుమనిపించింది. దాంతో సముద్రుణ్ని చూడాలనే కుతూహలం అణగారింది.

హోటల్‌కు చేరుకున్నాడు. ఆకలి దహించుకొని పోతోంది. దబదబా తన గదిలోకి వెళ్ళి, సేవకుడి కోసం గంట వాయించి, చెమటతో తడిసి ముద్దయిన దుస్తుల్ని విప్పాడు. ఫాన్ వొదిలి దాని కింద కూర్చున్నాడు కానీ, వెచ్చని గాలి ఏమీ సుఖంగా లేదు. మద్రాసులోనే ఇలా వుంటే, ఎండలకు పేరుగన్న తన వూళ్ళో ఎలా వుండివుంటుందో?

సేవకుడు వొచ్చాడు; భోజనం గది లోకి తీసుకొని రమ్మన్నాడు. యీలోగా కాస్త స్నానమన్నా చేస్తే హాయిగా వుంటుం దనిపించింది. బాత్ రూంలో దూరి షవర్ వొదిలి, దానికింద కూర్చు న్నాడు. ఆకలి బాధ వేధించకుంటే, చాలా సేపు ఉండేవాడే. నిజానికి యీ

చల్లని నీరు మీదపడుతూంటే తప్ప యీ ఎండను భరించటం అసంభవ మనిపించింది. వారం రోజుల్నుంచీ ఎంత ప్రయత్నించినా ఎయిర్ కండిషన్ కాటేజ్ దొరకటం లేదు.

బాత్ రూంలోంచి రాగానే సేవకుడు వొచ్చాడు; కాని భోజనం రాలేదు. ఒక ఎక్స్ప్రెస్ డెలివరీ కవరు టేబిల్ మీద పెడుతూ 'భోజనం లేదు సార్...టిఫిన్ తెమ్మంటారా ?' అన్నాడు.

నీరసం మండిపోయింది. తనలాటి ఐశ్వర్యవంతుడు వినరానిమాట విన్నాడు. కాని ఏం చెయ్యటం? కారులో బయలుదేరి, యీ ఎండలో హోటళ్ళు వెదికే ఓపిక లేదు. యీ ఆకలి తీరేందుకు టిఫినే గతి !

'సరే—పోయి, టిఫిన్ తీసుకురా, త్వరగా—' అన్నాడు చిరాగ్గా. సేవకుడు వెళ్ళిపొయ్యాడు.

ఎదురుగుండా వున్న కవరు విప్పి చదవాలనే కుతూహలాన్ని, ఆకలి అవతలికి నెట్టేసింది. చాలా బాధగానూ, వికారంగానూ వుంది. వడదెబ్బ తినలేదు కదా? అనుమానంవేసి వొళ్ళు ముట్టుకు చూశాడు ...కాని ఏమీ తెలియ లేదు.

యీ రకం జీవితం ఆరంభమై అప్పుడే మూడు నెలలయింది. తనకు ఇల్లు లేదు; వాకిలి లేదు. నా అనే వాళ్లు లేరు. హృదయపూర్వకంగా ఆదరించే వాళ్ళు లేరు. ప్రతిదీ చికాకుగానే వుంది. దేని మీదా ఇంటరెస్ట్ లేదు: ఒకొకప్పుడు ఛస్తే పీడ వొదిలిపోతుం దనిపిస్తుంది... కాని యీ ఆస్తినంతనూ వశం చేసుకోకుండా ఉండటమా? ఆ సంగతి గుర్తొస్తే పట్టుదల అధిక మౌతుంది. ఆస్తి మొత్తం పది లక్షలకు మించే వుంటుంది! సరిగ్గా ఎంతో కూడా తనకు తెలియదు. అంచనా వేయవలసిన అవసరమూ కలగలేదు. పాతికేళ్ళన్నా నిండని తనకు యీ గొడవంతా మహా చీదరగానూ, తలనెప్పిగానూ వుంది.

ఈ అవస్థంతా తండ్రి పోతూ పోతూ కల్పించాడు. తనతోపాటు కుటుంబ శాంతిని కూడా పరలోకాలకు తీసుకొని పొయ్యాడు. ఆ వీలునామా రాయకుంటే నేం? రాసినవాడు, ఆస్తి మేనేజ్ మెంట్ అంతా బతికి వున్నంత కాలం తల్లే చూడాలనీ, ఆతరువాత కొడుకు చూడాలనీ ఎందుకు రాయాలి? ఆయన ఉద్దేశ్యం ఏమిటో స్పష్టంగా తెలియదు. ఊహకు అందేవరకూ, ఆయన దృష్టిలో తను యోగ్యుడు కాదు. యీ విలాస జీవితంలో అంతా పాడుచేస్తాడని భయపడి ఉంటాడు. తనేం చెడుపనులు చేశాడు కనుక? ధనమంటూ వున్నాక, దాన్ని అనుభవించ నట్లయితే అది వ్యర్థమేకదా! పోతే చదువు అంటలేదు; దానికి దిగులు పడటం దేనికి? యీ ఉన్నచదువు ఆస్థిపాస్తుల్ని మేనేజ్ చేసేందుకు చాలదు కనుకనా? ఆ లెక్కను చూస్తే, చదువు సంధ్యలూ, సంస్కారాలూలేని తల్లి, తన కన్నా తెలివిగలదెలా అవుతుంది? ఆడ కూతురు యీ వ్యవహారాలన్నీ చూడగల దని తండ్రి అనుకున్నాడంటే, నిజంగా ఆయన ఎంత తెలివిగల వాడుగా, సమర్థుడుగా పరిగణించ బడుతూన్నప్పటికీ, ఆ వీలునామా రాయటం అనాలోచితంగా నన్నా చేసివుండాలి; మతిపోయి, ఆతృత కొద్దీ తప్పటడుగన్నా వేసి వుండాలి.

—పోనీ తల్లినీ తననూ కలిసి మేనేజ్ చేయమని ఆదేశించివున్నా బాగుండేది. అంతా తనకు అప్పగిస్తే తల్లిని అన్యాయం చేస్తానని ఆయన అనుకొని వుంటాడా? తన కొడుకులో అంత అమానుషత్వం వున్నదనుకుంటే, నిజంగా ముసలాడికి బాగా పైత్యించి ఉండాలి. ఏనాడన్నా తను తల్లిమాటను జవదాటాడా? ఆమె అంటే తనకు పంచప్రాణాలూను. ఆమె వొద్దన్నదని నిర్మలప్రణయాన్ని కూడా లెక్కచేయకుండా, ప్రియురాలికి చేసిన బాసలన్నిటినీ తోసిపుచ్చలేదా? అంతకన్నా గొప్ప తార్కాణం ఏం కావాలి? తన సుఖాన్ని కూడా తల్లికోసం త్యాగం చేశాడాయన!...పాపం! నిర్మల! తన తండ్రి యీ వీలునామా రాశాడని ముందుగా తెలుస్తే, కనీసం ఆ నిర్మలనన్నా పెళ్ళాడేవాడు. తనకు అన్యాయం చేసుకొని ఆమె కూడా అన్యాయం చేశాడు...ఆమె మనస్సు ఎంత విరిగిపోకపోతే, ఆ రెండో పెళ్ళివాణ్ని చేసుకొని, దుఃఖాశ్రువులో, ఆనందబాష్పాలో ప్రపంచానికి తెలియని స్థితిలో కాపరానికి వెళ్ళిపోతుంది! తండ్రి చేసిన ఒక్క తెలివిమాలిన పనివల్ల, తను మరి కొన్ని తెలివిమాలిన పనుల్ని చేశాడు!

మొదట్లో ఇదంతా అతిసామాన్య విషయంగా తోచింది; కాని తండ్రికి చేయవలసిన కర్మన్నా పూర్తి కాకుండానే, వొచ్చిన బంధు మిత్రులు వీలునామాను పెళ్ళగించి చర్చలు ఆరంభించారు. క్షణంలో రెండు పార్టీలుగా తయారై కొట్లాట పర్యంతమైంది. అమ్మలో ఎంత మార్పు! అధికారాన్ని చెలాయించాలనే ఆమె తహతహ తాలూకు వేడికి, తను తట్టుకోలేక పొయ్యాడు. వాగ్వాదం పెరిగింది; కాని మాటల్లోనూ, ప్రార్థనల్లోనూ తేలే వ్యవహారంగా తోచలేదిది. కోర్టులో తప్ప తేలేట్లు లేదు.

—అంతే, ఆ చిరాకులో తను ఇల్లు వొదిలాడు. తనతోపాటు తన పక్షీయులు కూడాను. ఆస్థిపాస్థులు చేతులో వొచ్చేదాకా డబ్బు కావాలి. ఎట్లాగా అని తను మథనపడుతూండగా స్నేహితులే సర్దుబాటు చేశారు. మార్వాడీకి రూపాయి వడ్డీకి నోటు రాయటం తడవుగా డబ్బు దొరికింది. ఇదంతా ఏదో ఉచితంగా వొచ్చి పడుతున్నట్లే తోచింది తనకు. ఎన్ని రెవిన్యూ స్టాంపులమీద తనసంతకం పడిందో! ఏమైతేనేం—యీ ఆస్థి అంతా తన పరమైనప్పుడు, వాడి బాకీ తీర్చిపారేస్తే మాత్రమేం! తన పరువు మర్యాదల్ని కాపాడిన డబ్బది!

—యీ జీవితం చాలా కృత్రిమంగా వుంది. తనతో మాట్లాడే ప్రతివ్యక్తీ బలవంతంగా చిరునవ్వు నవ్వేందుకు ప్రయత్నిస్తాడు. తనను చాలా గొప్పవాడల్లే గౌరవించాలని వొంగి వొంగి సలాములు చేస్తాడు. నిజానికి తనేం గొప్పవాడు? తన పక్షం జేరిన వీళ్ళందరికీ తనంటే ఆపేక్ష వున్నదనుకోవటం శుద్ధ పొరపాటు. తన తల్లిమీద విరోధమూ లేదు. వీళ్ళ ఏడుపు ఏమిటంటే ఆ ఆస్థి అంతా తనకు వొస్తే తలాకాస్త పిండుకోవచ్చని! తనను యీ మాత్రం కూడా తెలియని బడుద్ధాయి అని వీళ్ళందరి ఉద్దేశ్యమూ కాబోలు!

లాయర్ తన కేసు తప్పకుండా గెలుస్తుందంటాడు. ఎట్లా గెలుస్తుందో తనకు అర్థం కావటం లేదు. ఆస్థి అంతా తండ్రి స్వార్జితం. ఆయన ఇష్టానుసారం రాసు కుంటే చెల్లితీరుంది. తనేదో తొందరపడి గంతువేశాడు. కాని ఇప్పుడు ఆ ఉద్రేకం చల్లారాక, లోకజ్ఞానంతో ఆలోచిస్తే తన కేమీ హక్కు లేనట్లే తోస్తోంది...ఐతే ఉన్నదాన్ని మసి పూసి మారేడు కాయ చేసి, తనను గెలిపించవొచ్చు. ఎన్నో న్యాయాలు అన్యాయాలుగానూ, అన్యాయాలు న్యాయాలుగానూ కోర్టుల్లో పరిష్కరించ బడటం తనకు తెలియకపోలేదు ...ఇదంతా ఆ లాయర్ ఎందుకు చేస్తున్నాడు? న్యాయ సంస్థాపనార్థమూ కాదు, తనంటే ఆపేక్ష వుండీ కాదు, తన తండ్రి పీలునామాను అగౌరవించాలనీ కాదు—ఏమీ కాదు; డబ్బు కోసం—వెధవ డబ్బు!

కానీ, లక్ష్మి స్వరూపమైన డబ్బును దూషించటంలో, హీనపరచటంలో, తను పొరబడ్డాడనే సంగతి వెంటనే గుర్తొచ్చింది. ఆ డబ్బే లేకుంటే, తనను ఏనాడో హోటల్ లోంచి విసిరి బైటికి పారేసేవారు. తనకీ స్నేహితులూ, ఆప్తులనే వాళ్లుండేవాళ్లు కాదు. ప్రపంచంలో కొనుక్కో దగినవన్నీ డబ్బు కొంటూనే వుంది. అసలు యీ డబ్బుకోసమే గదా తానీ ఊబిలో ఇరుక్కుంది!

టిఫిన్ రావటంతో ఆలోచనల్లోంచి ఊడిపడ్డాడు. అవురావురంటూ తిన్నాడు. ఆకలిజ్వాల అణిగాక, చాలా అలసటగా తోచి, పక్కమీద వాలాడు. ఇంత అశాంతిలోనూ నిద్రపట్టింది. నిద్ర లేచాక మరికొంత అశాంతిని భరించగలడు. అందుకని నిద్ర పట్టటమంటే తాత్కాలికంగా బాధలనుంచి విముక్తిపొందినట్లనిపించినా, ఆ తరువాత ఆ బాధలన్నీ భరించేందుకే కదా!

అలారం గడియారంలాగు టెలిఫోన్ మోగుతోంది; కలత నిద్రలో ఉండగా; విసుగ్గా చిరాగ్గా రిసీవర్ ఎత్తకుండానే బద్ధకించాడు. కాని టెలిఫోన్ మోగటం ఆగలేదు. ఎవడో స్నేహితుడు మాట్లాడాలనుకుంటూండి ఉండొచ్చు. తనను కాస్సేపన్నా పడుకోనీరు. తను తను కాదు; ఇతరులకు ఉపయోగపడటానికి సిద్ధంగా ఉండాలి. ఆ ఇతరుల్ని తను ఉపయోగించుకోవచ్చు కాని, తనకా అవసరం లేనప్పుడుకూడా విడవరు. వీళ్లెవరికీ కనిపించకుండా ఏ ఏకాంత ప్రదేశంలోనో, కొన్నాళ్ళ పాటు అజ్ఞాతవాసం చేస్తే బాగుండు...మూడు నిమిషాలపాటు టెలిఫోన్ మోగినా లెక్కచెయ్య లేదు. ఎవరో, ఏమిటో, ఏం మాట్లాడాలనుకున్నారో తెలుసుకోవాలనే ఆతృతకూడా లేదు. టెలిఫోన్ మోగటం ఆగాక, ఫీడా వొదిలిం దనిపించింది.

మళ్లీ నిద్ర పట్టే సూచన ల్లేవు. సాయింత్రపు ఎండ తీవ్రత లేకుండా చెట్లమీదపడి మెరుస్తోంది. వాతావరణంతోపాటు తనకు కూడా కొత్త ఉత్సాహం వచ్చింది; బహుశా కారణం అది కాదేమో? నిన్న మార్వాడీ పదివేల రూపాయలు అప్పిచ్చాడు; ఆ డబ్బంతా సద్వినియోగం కానిదే తనకు ప్రశాంతత కలగదు. డబ్బు లేనప్పుడు లేదనే అశాంతి; ఉన్నప్పుడు దాన్ని అనుభ

పించాలనే ఆతృత కలిగించే అశాంతి! యీ రెంటికీ సమన్వయం లేదు. డబ్బు లేనప్పుడు ప్రపంచంలో తానెంత అల్పుడో బాగా తెలిసి వొస్తుంది; ఉన్నప్పుడు ప్రపంచం ఎంత అల్పమైనదో కూడా తెలుస్తుంది!

కొత్త ఉత్సాహంతో లేచి కూర్చున్నాడు; బాత్ రూంలోకి వెళ్లి మొహం కడుక్కున్నాడు. చాలా హాయిగా వుంది. బాయ్‌ని పిలిచి కాఫీ, టిఫిన్ తెచ్చుకొని అరగిస్తూండగా మళ్లీ టెలిఫోన్ మోగింది.

శాస్త్రిగాడు అరింటికల్లా వొచ్చేస్తానన్నాడు; బహుశా వాడే ఐ ఉంటాడు. శాస్త్రి సంగతి గుర్తు రాగానే తాను నిర్మించుకున్న స్వర్గమంతా మెదడులో మెరిసింది. వాడు తనతోపాటే నవ యవ్వనిని, కాలేజి స్టూడెంట్‌ను, అందగత్తెను వెంటపెట్టుకొని వొస్తాడు. ఇలాటి వ్యవహారాల్లో శాస్త్రి అందెవేసిన చేయి. పైకి చాలా పెద్దమనిషిల్లే కనిపిస్తాడు కాని, చేసేవన్నీ ఇలాటి పనులే! ఐతే వాడు సామాన్యుల్తో మాట్లాడడు. ధనవంతులు—ఆ డబ్బువాళ్లెలా సంపాయించినా, వాళ్లతోనే వ్యవహారాలు జరిపి తను కూడా లాభం పొందుతాడు.

టెలిఫోన్ ఎత్తాడు; అవతలినుంచి శాస్త్రి మాట్లాడుతున్నాడు. మరో అరగంటలో తాను 'ఆమె'తో సహా దూసుకున్నానని హెచ్చరించాడు. తను కూడా ఉత్సాహంగా, వీలైతే ఇంకా త్వరగా రమ్మని ఆదేశించాడు.

డబ్బుంటే ప్రపంచాన్నే తనకు అనుకూలంగా తిప్పుకో వొచ్చు. పుట్టినదాదిగా యీ రహస్యం ప్రతి క్షణమూ తన చెవుల్లోకి అన్ని వైపులనుంచీ లౌడ్ స్పీకర్లలోంచి ఊదినట్లు ప్రతిధ్వనిస్తూనే వుంది. అందుకనేగా ఇప్పుడు కన్నతల్లి మీదకూడా తాను కత్తి కట్టింది! అదే విధంగా తల్లి కూడా తనకు ప్రతి కక్షియంగా పోరాడేందుకు సిద్ధపడ్డది. యీ వెధవడబ్బు మాతృ ప్రేమను కూడా దూరం చేయగలిగిందంటే, దాని శక్తికి వేరే దృష్టాంతరాలు అనవసరం.

శాస్త్రిగాడు గుర్తు రాగానే, తనకీ సమయంలో వెధవ ఆలోచనలు ఎందుకనిపించింది. తన దగ్గరున్న డబ్బుతో తనకు కావలసిన కొత్త లోకాన్ని సృష్టించుకోగలడు; ఐనప్పుడు తనకీ ప్రపంచ విధానంతో పనేమిటి? తన స్వార్థం కోసం బలి ఆయేందుకు అనేకులు సిద్ధంగా వున్నారు. వాళ్ల బాధను గూర్చి ఆలోచించటం కన్నా, తాను పొందే ఆనందాన్ని గూర్చి తలుచుకోవటం తనవిధి! ఇందులో ఆశయాలూ, న్యాయాన్యాయాలూ అనవసరం! తాను జీవితఫలంనుంచి ఎంత రసాస్వాదనం చేయగలడనేదే ప్రశ్న!

శారీరకంగా కొంత ఉల్లాసంగా ఉండేందుకు బ్రాందీ పట్టించాడు. మరీ వొళ్లుమరిచేంతవరకూ వెళ్లలేదు. తాగటం వల్ల మత్తుమత్తుగా, శరీరంలో ఏదో కొత్త ఉత్సాహం ప్రవేశించి, కొన్ని అశ్వశక్తులు ఎగతంతూన్నట్లు ఉండేవరకే వెళ్లాడు. ఇదంతా తాను పొందబొయ్యే ఆనందాన్ని కొన్ని రెట్లు పెంచుకునేందుకే! డబ్బున్నవాళ్ల కోసం ప్రపంచంలోని మేధావులు ఎన్నెన్ని కొత్త

విషయాల్ని కనిపెట్టారు! డబ్బుకోసం సకల సేవలూ చేయని మనుషులు—వాళ్లు మనుషు లెట్లా అవుతారు—దేవతలే నేమో?

తలుపు చప్పు డవటంతో ప్రాణం లేచి వొచ్చింది. తలుపు తెరవగానే శాస్త్రి చిరునవ్వుతో గదిలో ప్రవేశించాడు; వాడివెనుక చీరె కుచ్చెళ్లు కనిపించక పొయ్యేప్పటికి సీనుకు చిరాకు పుట్టింది. ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడిచాడు.

'రాలా? ఉండండి...' అని శాస్త్రి బైటికి తొంగిచూసి 'లోపలికిరా, అంత సిగ్గేమిటి? బైట అలా నిలబడితే, ఎవరైనా చూస్తే ఎంత అసహ్యంగా వుంటుందీ!' అన్నాడు.

ఆ తరువాత ఆమె హంస నడకతో, వయ్యారంతో, గట్టిగా నడుస్తే పాదాలు కందిపోతయ్యేమో నన్నట్లు, మెల్లిగా గదిలోకి ప్రవేశించింది. మొహం తనకు కనపడకుండా ఉండేందుకేమో, నేల చూపులు చూస్తూ, భయం ద్వారా సిగ్గును వెళ్లబుచ్చేందుకు ప్రయత్నిస్తూండటాన్ని సీను గమనించక పోలేదు. కొంచెం కొత్త మేళమై వుంటుం దనుకున్నాడు. దాంతో పాటే ఆమె చదువుకున్నదనీ, దుస్తుల ధారణనుబట్టి మంచి వంశంలో మంచి, కనీసం కొస్త ధనవంతుల ఇంటినుంచే వొచ్చి వుంటుందనే అభిప్రాయం కలిగింది. ఆమెపట్ల ఆ 'ధనం' ఎప్పుడైతే అన్వయించబడిందో, అప్పుడే ఆమె మీద గౌరవ భావం ఏర్పడింది.

అందుకనే 'కూర్చోండి—' అని కుర్చీ చూపాడు! ఇంకొకరైతే 'అండీ!' అనే


ఘనతవల్లనే అగ్రస్థానం



ప్రతీ షాపులోను దొరుకును


వాడు కాదు. ఆమె కొస్త ఆలోచించి సిగ్గుపడతూనే కుర్చీలో ఒక మూలకు వొదిగి కూర్చుంది.

శాస్త్రి మాత్రం యీ గది తనస్వంత మయినట్లుగా గ్లాసులోకి బ్రాందీ పోసుకొని గడగడా తాగుతున్నాడు. ఐశ్వర్యవంతుల్తో తిరుగుతూండటంవల్ల, ఆ ఐశ్వర్యం తనకూడా అంటుకున్నంత ధీమాలో ఉన్నాడు. పోతే తన బలహీనతేదో తెలుసు కనుకనే శాస్త్రికి ఇక్కడ అవసరం కొద్దీ కొంత చనువు ఏర్పడింది.

'ఆ అమ్మాయికూడా కొస్తసర్వత్ ఇవ్వవయ్యా!' అన్నాడు సీను.

'రా...ఇటు తిరుగు—' అని ఒక గ్లాసుకు నింపి, సోడా వేశాడు శాస్త్రి.

ఆముదాన్ని చూసినట్లు చూసిందామె.

'నా కొద్దుబాబూ!' అంది ప్రాధేయ పడేట్లుగా.

ఆమె వొద్దన్నప్పుడే, తప్పకుండా ఆమెచేత తాగించాలనే పట్టుదల సీనులో అధికమైంది. ఒక నేరం చేసేవాడు, తన లాగే మరికొంతమంది నేరస్థుల్ని చూసి, తనకూ కూడా ఎంతో తోడు వున్నదనే తృప్తి పొందటం సహజం; బహుశా అలాటి మనస్తత్వమే సీనులో పని చేసి ఉండాలి.

'షర్బత్ కేం...తాగండి' అన్నాడు సీను.

'వొద్దనకూడదు. ఇక్కడ నీవు అతిథివి. వొద్దంటే బాబుగారికి కోపం వొస్తుంది....ఊc....పుచ్చుకో' అన్నాడు శాస్త్రి అధికార స్వరంతో.

ఆమె నిస్సహాయంగా గదంతా కలయజూచింది. వొద్దంటే నిజంగానే బాబు గారికి కోపం వొస్తే, తనకిక యీ ప్రపంచంలో తావులేకుండా పోతుందని భయ పడినట్లు, కనీసం, నటించింది! మెదల కుండా ఒక్క గుక్క తాగి, ఉక్కిరి బిక్కిరై టేబిల్ మీద పెట్టేసి, మొహం ముడుచుకుంది.

'అబ్బ!...గొంతంతా మండింది!' అందామె.

ఆమె అవస్థ చూస్తే, సీనుకు నవ్వులాటగా వుంది. మరి కొస్త పట్టించేట్లు చేయాలి.

'మరి కాస్త సోడా కలపవయ్యా శాస్త్రీ!' అని పురమాయించాడు.

సోడా కలిపాక 'ఇప్పుడు మెల్లగా వుంటుంది...పుచ్చుకో...ఆరోగ్యం కూడాను!' అన్నాడు సీను. తనస్థితికి ఆమెను లాక్కొస్తాగాక, ఆమెను అండీ అని పిలవాల్సిన అవసరం లేదని కూడా నిశ్చయించుకున్నాడు.

ఆమె భయపడుతూనే గ్లాసు ఖాళీ చేసింది.

'ఇంకో గ్లాసు—' అన్నాడు సీను.

'వొద్దండీ...నా కసలు అలవాటు లేదు!' అందామె బుంగమూతి పెట్టి బతిమాలుతూన్నట్లు.

'వాంతి చేసుకుంటుందేమో మేళాం—పోనిద్దురూ!' అన్నాడు శాస్త్రి. యీ కాస్తా తనకు లేకుండా ఐపోతుందేమో నని వాడి ఏడుపు!

ప్రపంచంలో డబ్బుకోసమని చేయరాని పనులెన్నో జరుగుతున్నవి; దానికోసమని నైతిక పతనం, ఆరంభమైనప్పటికీ, అది ఎంత దూరం వెళ్తుందో కూడా ముందు వెనుకలు ఆలోచించటం అసలే లేదు. ముక్కూ మొహం తెలియని తన కోసమని, యీ రాత్రి తనకు భార్యాత్వాన్ని వహించేందుకని, యీమె వొచ్చింది. పాపం—యీమె అంతవరకే తాత్కాలికంగా పతన మయ్యానని అనుకొని ఉండొచ్చు; తాను ఆమె చేత తాగించ గలిగాడు. మరొక మెట్టు కిందికి జారింది. ఇంకొన్ని మెట్లు జారద నేమిటి?

'పోయి ఏమన్నా టిఫిన్ పంపవయ్యా' అన్నాడు సీను.

చివరి గ్లాసు గడగడా తాగి, శాస్త్రి వెళ్తూ వెళ్తూ 'పంపిస్తాను. నేను ఎప్పుడు రావాలి?' అన్నాడు.

'నేను పంపిస్తా లేవయ్యా!'

శాస్త్రి మెదలకుండా జారుకున్నాడు.

## 2

'నీ పేరేమిటీ?' అన్నాడు పీను.

'శకుంతల'

శకుంతల! ఆలనాడు దుష్యంతుని వలపు వలలో ఇరుక్కున్న శకుంతల! ఆ శకుంతలకు పాపం తెలియదు—ఉత్తరోత్తరా దుష్యంతుడు తనను విడనాడుతాడనీ, మరిచిపోతాడనీను. కాని యీ శకుంతలకు తెలుసు—ఇప్పుడు యీమె తనకు ఏమైనా, తెల్లారితే ఒకరికొకరు ఏమీ కామని! బహుశా ఆ శకుంతల కూడా దుష్యంతుడు మహారాజనీ, తాను రాణి నౌతాననే నమ్మకంతోనే అతనికి లొంగిపోయిందేమో? ఐశ్వర్యమనేది ఆరోజుల్లోనూ తన పలుకుబడిని చూపింది. భేదమల్లా ప్రస్తుత ప్రపంచంలో ఏం జరగబోతోందో, స్పష్టంగా చూడగలుగుతూనే అన్నిటికీ సిద్ధమై, అనేక అత్యాచారాలు నిర్వర్తించబడుతూన్నవి. దుష్యంతుడు మహారాజుగాక, ఏ మునికుమారుడో అయి, బిరుసు గడ్డాలు పెంచుకున్నట్లయితే, శకుంతల కథ వేరొక విధంగా సాగేది!

ఇంతలో టిఫిన్ వొచ్చింది. పీను బలవంతపరిచి ఆమెచేత తినిపించాల్సి వొచ్చింది. ఈ సిగ్గులూ, బిడియాలూ, మొహమాటాలూ, బెట్టుసరులూ—ఇవన్నీ ఒక నూతనానుభూతిని సృష్టించేందుకూ, మానవుని నిజస్వరూపాన్ని దాచేసేందుకూ చేసే ప్రయత్నాలే కాని వేరు కాదు. పెంపుడుకుక్కల కన్నా హీనంగా ప్రవర్తించే యీ మనుషుల్ని చూస్తుంటే తనకు నవ్వొస్తుంది; ఒకోసారి వారి చిరునవ్వు వెనుక దాగిన ఈర్ష్యని, అనురాగం వెనుక దాగిన ద్వేషం, గౌరవం వెనుక దాగిన గుండె మంట, మొదలైన వాటిని గమనిస్తే—ఇంత హీనులు కనుకనే తాను తనకు కావలసిన సౌఖ్యాలన్నిటినీ గెలుచుకో గలుగుతున్నాననే గర్వం కలుగుతూ వుంటుంది.

ఆ తరువాత పంచేంద్రియాలూ చేసే తిరుగుబాటునూ, బ్రాందీ కడుపులోంచి, తన్నిన తన్నుల్నీ, ఆమె కిక్కురు మనకుండా భరించింది. తమ మధ్య జన్మజన్మాల స్నేహం ఉన్నట్లే, తనకీ ప్రపంచంలో వేరొక తావు లేదన్నట్లే, ఆమె ప్రవర్తించింది. ఇదంతా తనపట్ల గాక, తన డబ్బుపట్లనే ఆమె తన వాత్సల్యాన్ని ప్రదర్శిస్తోందని తెలుసు. అందుకనే కదా, ఆ డబ్బుకోసం తను ఎన్ని పాట్లన్నా పడుతూండటం! అదే లేనట్లయితే ఇప్పుడీ శకుంతలకు, తన దృష్టిలో ఉన్న స్థానం లాంటిదే, తనకూ మరికొంతమంది దృష్టిలో ఉండి ఉండేది.

ఎప్పుడో ఎక్కడో మనుషుల్ని జంతువులవలె అమ్మే బానిస వ్యాపారం ఉండేదంటారు. ఇప్పుడీ ప్రస్తుత ప్రపంచంలో మాత్రం ఇంకొక రూపాన బానిస వ్యాపారం సాగటం లేదు కనుకనా? ఐతే యీ వ్యాపారానికి కొంత నాగరికత, సంస్కారం ఉండబట్టి, ఇది బానిస వ్యాపారమని స్ఫురించటం లేదో, లేక మనుషులు బాగా అలవడిపోవటంవల్ల గమనించటం లేదో, అదీగాకపోతే తాత్కాలికంగా బానిసలౌతున్నాము కనుక, ఆ

తరువాత ఎలాగూ స్వేచ్ఛ వుండని ఎవ్వరూ పట్టించుకోవటం లేదో? సూక్ష్మ దృష్టిలో చూస్తే వస్తురూపాలు మారినా, తత్వాలూ, రుచులూ, వాటి వెనుక ముసుగు తెరలు వేసుకున్న ఆశయాలూ ఎక్కడ మారినయ్? మారినవనీ, మనం అభ్యుదయ పథంలో ఉన్నామనీ అనుకోవటం ఆత్మతృప్తికే ఐనా, నిజానికది ఆత్మవంచనే కాని మరొకటి కాదుకదా!

ఆమె అలసిపోయి సోఫాలో విశ్రాంతి తీసుకుంటోంది; ఆమె మొహంమీది చిరుచెమటలో దేదీప్యమానంగా వెలిగే విద్యుద్దీపాలు ప్రతిఫలిస్తున్నవి. ఇంత మంచి పిల్ల, యీ నైచ్యాన్ని ఎలా భరిస్తోందా అనిపిస్తోంది—కాని ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో రూపేణా నీచమని తెలిసేదాన్ని ఆరాధిస్తున్నారు. ఉదాహరణకు, యీ హోటల్ వాడు రోజుకు పదిహేను రూపాయలు తననుంచి గుంజుకునేందుకుగాను, తాను చేసే ప్రతి నీచ కార్యాన్నీ భరిస్తూనే ఉన్నాడు. పైపెచ్చు తానొక ప్రయోజకుడల్లే, పురుషోత్తముడల్లే కూడా వాడు చూస్తాడు. డబ్బు నైచ్యాన్ని ఉత్కృష్టంగా చిత్రించగలదు. కురూపిని రూపవంతుడుగా చేయగలదు. ఆదిమ మానవుణ్ని నవనాగరికుణ్ని చేయగలదు. డబ్బు చేయలేని దేమిటి?

తలుపు చప్పుడైంది. సీను చాలా చిరాగ్గా, కఠిన స్వరంతో 'ఎవరూ?' అన్నాడు.

'నేను సార్... టెలిగ్రాం వుంది!'

సీను ఆతృతతో తలుపు తెరిచి టెలిగ్రాం అందుకొని, తలుపు గడియవేసుకున్నాడు. అయ్యగారు కోపంగా వున్నారని గ్రహించిన సేవకుడు, మెదలకుండా వెళ్ళిపొయ్యాడు.

టెలిగ్రాం చదువుతూండగానే సీను ముఖకళలన్నీ మారిపోయినయ్. తన చెల్లెలు పంపిందా టెలిగ్రాంను. అమ్మ చావు బతుకుల్లో ఉందట...తనను వెంటనే రమ్మంది.

మధ్యాహ్నంనుంచీ తనకోసం ఎదురుచూస్తున్న ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం మీద ఎర్ర లేబిల్ ప్రమాదమని సూచిస్తూనే వుంది. ఇప్పుడా ఉత్తరాన్ని చించి చదవసాగాడు. అదికూడా చెల్లెలే రాసింది. అమ్మ ఆరోగ్యం ఏమీ బాగా లేదు. ముఖ్యంగా తను దూరమైనందుకు దిగులుపడి పోయింది. 'సీను!...సీను!...' అని కలవరిస్తోంది. వెంటనే రమ్మని చెల్లెలు చాలా ప్రాధేయ పడింది.

సీనుకు బుర్ర తిరిగిపోయింది. వెధవ డబ్బు తనను అమ్మకు కొడుకు గాకుండా చేసింది! యీ డబ్బుకోసమని ప్రపంచం ఇరవైనాలుగ్గంటలూ పనిచేస్తూ, కానివారినే ఆత్మ బంధువులట్లు ప్రవర్తింపజేస్తోంది. నిజంగానే రక్త సంబంధమున్న బంధుత్వాలను తెగ తెంపులు చేస్తోంది. ఆస్థి సాక్షాత్తూ తనను కన్న తల్లి చేతుల్లో ఉన్నంత మాత్రాన, తానెందుకు ఆమెను తల్లిగా పరిగణించ లేదు? ఆమెకూడా తక్కువ తినలేదనుకో—కాని తనను కని, స్తన్య మిచ్చి పెంచిన మాతృప్రేమకు కూడా తను కృతజత చూప లేదు. డబ్బు తెలివి తేటల్ని సృష్టించటం ఎంత నిజమో,

మార్గత్వాన్నీ, బర్బరత్వాన్నీ సృష్టించ గలగటమూ అంతే నిజమేమో?

ముందు అమ్మను చూడాలి. తనకోసం పంచ ప్రాణాలనూ బిగపట్టుకొని, మంచంలో పడివుండి, కళ్లు కాయలు కాచేట్లుగా దీనంగా ఎదురుచూసే అమ్మను తలుచుకుంటే గుండె గుభేలు మంటోంది; వేనవడబ్బు ఎంత నిష్ప్రయోజనమో, తిరిగి ఆ మాతృమూర్తిని తనదిగా చేసుకునేం దుకన్నా ఉపయోగపడుతుందో లేదో తెలియటం లేదు. నిజంగా తాను అమ్మ దగ్గిరికి పోకముందే, ఆమె యీలోకాన్ని విడిచినట్లయితే, తనంత మహాపాపి ఎవ రుంటారు? ఎన్ని జన్మాలు పశ్చాత్తాప పడినా ఎన్ని సముద్రాల కన్నీళ్ళు కార్చినా పాప పరిహార మవగలదా?

అమ్మ మరణానంతరం ఆస్తంతా తనదే అవుతుందనే ఊహే సీనుకు రాలేదు. అమ్మను అమ్మగా చూడగలుగుతే, డబ్బు ఎంత అల్పమైనదో అర్థమౌతోంది. చిన్న నాటి ముచ్చట్లు—పావు శతాబ్దంపాటు ఆమె అహోరాత్రులూ తనపట్ల కర్షించిన అనురాగ సుధను, తానామెమీద కురిపించిన అగ్ని కణాలు, చివరకు ఆమెను, తన తల్లిని, కోర్టుకు లాగేందుకూడా వెనుకాడని కార్కశ్యం, ఆ దేవతా మూర్తికి ప్రసాదించిన వ్యాఘాతాలు మొదలైనవి తనను మానవుణ్ణిగా బతకనీవు. సమాజంలో తానొక ధనికుడూ, పెద్ద మనిషీ కావొచ్చు, కానీ తనకు తాను రాక్షసుడు!

ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే ఏం లాభం? ఇప్పుడు బయలుదేరుతే, మెయిల్ అందుతుంది.


అత్యుత్తమ శాస్త్రీయ గ్రంథాలకు సామాన్యులకు కూడా అర్థమయ్యే తెనిగింపు.

| | | | |
|---|---|---|---|
| 1. | సిగ్గు | హావలాక్ ఎల్లీస్ | రూ. 1—0—0 |
| 2. | ఋతుధర్మాలు | ... | రూ. 1—0—0 |
| * 3. | లైంగిక విజ్ఞానం | ... | రూ. 1—0—0 |
| * 4. | ప్రణయకళ | ... | రూ. 1—0—0 |
| 5. | స్వరతి | ... | రూ. 1—0—0 |
| 6. | గర్భనిరోధం (సచిత్రం) | | రూ. 0—8—0 |
| 7. | వివాహ చరిత్ర | ... | రూ. 1—0—0 |

పుస్తకాల ఖరీదుకు రూ. 0-8-0 అధికంగా పంపిన వారికి, రిజిష్టర్డ్ పోస్టులో పంపబడుతవి. * ఈ గుర్తులున్న పుస్తకాలు లేవు.

అభిసారిక కార్యాలయం,
4, బాలుమొదలివీధి, మద్రాసు-17.

'శకుంతలా!' అన్నాడు.

'ఏమండీ?' అందామె వొళ్లు విరుచుకుంటూ.

'టాక్సీ పిలిపిస్తాను కాని, వెళ్ళు... నేను తొందర పనిమీద ఊరు వెళ్ళాలి' అన్నాడు.

ఆమె ఎదురు చెప్పలేదు; కట్టుకున్న భార్యలు ఇంతకన్న లొంగి వుంటారా?

ఆమెను సాగనంపేప్పుడు వందరూపాయిల కాగితాన్నిచ్చాడు. ఆమె మారు మాట్లాడకుండా వెళ్లిపోయింది.

## 3

రైల్లో రాత్రంతా మేలుకొనే ఉన్నాడు; వెళ్ళగానే అమ్మ పాదాల మీద పడి,కన్నీరు కార్చి యీ వెధవ డబ్బు తనకుఅక్కర్లేదని అనాలని నిశ్చయించుకున్నాడు. తానేదో త్యాగం చేస్తున్నాననే గర్వం కలుగుతుందని కాదు. సామాన్య మానవునివలె, తన తల్లి అవ్యాజానురాగాన్ని మాత్రమే పొందగలుగుతే చాలు! లేదా అమ్మనన్నా బతికించుకో లేకపోతే తన జన్మే వ్యర్థం.

రెండు గంటల ముందు డబ్బు ప్రపంచంలో చేయలేని దేమి టనుకున్నాడు; మానవాతీత శక్తుల్ని కొన్నిటిని మినహాయిస్తే, దాని శక్తికి మానవ శక్తులన్నీ కట్టుబడే ఉంటూన్నవి. ఏ డబ్బయితే తల్లినీ తననూ విడదీసిందో దాన్నే తాను వొదులుకో గలుగుతే, అమ్మ మళ్లీ తనదవుతుంది. అంటే తాను అమ్మను కొనుక్కోగలడన్నమాట! చిత్రమైన యీ లోకంలో ఆత్మబంధువుల్లో అగ్రస్థానం వహించే మాతృమూర్తిని కూడా కొనిపెట్టగలదు—డబ్బు! బహుశా అమ్మ ఇవన్నీ ఆలోచించలేదు. కనుక ఆమె తనకు అమ్ముడవుతున్న భావమే కలగకుండా, ఆమెను కొనుక్కోవొచ్చు.

—చాలా ఆత్రుతతో ఇంట్లోకి ప్రవేశించాడు; ఎదురుగా చెల్లెలొచ్చి పలకరించింది. ఆమెకు జవాబన్నా చెప్పకుండా సరాసరి అమ్మ మంచం దగ్గిరికి ఉరుకులు పరుగుల్తో వెళ్లాడు.

అశాంతి, అమ్మ ముఖంలో ప్రతిఫలిస్తోంది; ఆమె కళ్లు మూసుకొనే ఉన్నప్పటికీ హృదంతరాళంలో జరిగే కల్లోలమంతా, సముద్రపు టొడ్డున కనిపించే అలలల్లే ముఖంలో చూడగలుగుతున్నాడు. డబ్బు కారణంగానే ఆమె మనశ్శాంతిని కోల్పోయింది; ఇప్పుడా డబ్బుతోనే ఆమెకా మనశ్శాంతిని కొనిపెట్టగల పథకాన్ని తాను ఆలోచించాడు.

'అమ్మా!' అన్నాడు ఆమె ఫాలభాగంమీద చేయి వేసి.

ఆమె విసుగ్గా, మెల్లిగా కళ్లు తెరిచింది. తనకు ఎదురుగా కనిపించే దృశ్యాన్ని నమ్మలేక నేమో, తిరిగి కళ్లు మూసుకొని, మళ్లీ తెరిచింది. క్షణంలో ఆమెలోకి కొత్త శక్తులు ప్రవేశించినట్లు ఎంతో ఉత్సాహంతో లేచి కూర్చోబోయింది.

'ఎలా వుందమ్మా?' అన్నాడు సీను, ఆమె హైరానపడకుండా వారిస్తూ.

క్షణంలో ఆమె ముఖాన్ని ఆవరించ్చిన విషాద మేఘాలన్నీ విచ్ఛిన్నమైనవి. బైటినుంచి వొచ్చిన శాంతి దుమారంలో ఆమె పొందే బాధలేమీ ముఖంలో కనిపించటం లేదు.

'నాయనా! వొచ్చావా?' అన్నదామె సీను తల నిమురుతూ 'ఇక యీ జన్మానికి నిన్నుచూసే యోగ్యత ఉండదేమోనని

భయపడి పొయ్యాను......ఎంత చిక్కి పోయ్యావురా బాబూ! నీవు నాదగ్గిరే వుంటే నాకీ అవస్థ వచ్చేదా? ఇక నిన్నె క్కడికీ పోనివ్వను సీనూ!'

ఇంత మధురమైన మాటలు విని ఎన్నాళ్ళు ఎన్నేళ్ళయింది! అసలు వస్తువును ఇక్కడుంచుకొని, ఇన్నాళ్ళు దాని నీడల కోసం, కృత్రిమ సానుభూతుల కోసం, ఎండ మావులవైపు పరుగెత్తే దాహం గొన్న పాంథునివలె, తాను పిచ్చిగా నలుదెసలా ప్రయాణం చేశాడు. ఇంకా నయం! అలసిపోయి ప్రాణం పోక ముందే తాను మాతృమూర్తిని జేరి, నిజమైన అనురాగాన్ని పొందగలిగాడు. ఇక యీ స్థలంనుంచి కదిలే శక్తి సామర్థ్యాలు తనలో లేవు.

బహుశా ఆమె మనసులో కూడా ఇలాటి మధురానుభూతులే కలిగి ఉంటవి. ఉభయుల కళ్ళల్లోనూ నీరూరింది. ఒకరొ్నకరు చూసుకుంటూ, మాటలు లేకుండానే ఒకరొ్నకరు క్షమా భిక్షలు కోరి సాధించుకో గలిగారు.

ఇంత తేలిగ్గా — న్యాయస్థానాలకు పోకుండనే తల్లీ కొడుకులు తమ అనురాగాల్ని వెల్లడించుకున్నందుకు సీను చెల్లెలు ఆశ్చర్య పడింపంటే ఆశ్చర్యంకాదు.

రెండు రోజుల్లోనే సీను తల్లి చాలా ఆరోగ్యవంతురాలైంది. ఇప్పుడామె కొడుకును వొదిలి ఒక్క క్షణంకూడా ఉండటం లేదు. సీను కూడా తానీ జన్మలో మాతృసేవ కన్న చేయదగిన పనేటూ లేదన్నట్లుగానే ప్రవర్తిస్తున్నాడు. ముఖ్యంగా తాను అమ్మను బతికించుకో గలిగి, జన్మ తరింప జేసుకున్నాననే గర్వపడ సాగాడు.

మూడోనాడు మనసులో మరి దాచుకోలేక 'అమ్మా! నేను ఎప్పటికీ నీదగ్గిరే ఉంటూనే...నాకీ వెధవ ఆస్తి అక్కర్లేదు!' అన్నాడు సీను.

ఈ విషయాన్ని మాట్లాడేందుకే ఆమె కూడా భయపడుతోంది. ఎందుకంటే ఏ విషయంమీద తనకు సీను కొడుకు కాకుండా పొయ్యాడో, అదే విషయం తిరిగి ఎలాటి ఫలితాల్నిస్తుందోనని ఆమె భయం. ఇక సీను ఎటూ తేల్చి చెప్పాడు కనుక ఆమెకు మాట్లాడే సాహసం కలిగింది.

'ఆస్తా?' అందామె వికటంగా నవ్వి 'వెధవ ఆస్తి! చేతకాని ఆడముండకు నాకెందుకురా ఇదంతా? ఇవాళే నీకు రాసేస్తాను...సీనూ! నా బంగారు తండ్రీ!' సీనును ఆపేక్షతో కావిలించుకుంది.

ఈ మార్పుకు సీను తత్తరపొయ్యాడు. ఏదో మాట్లాడాలనుకున్నాడు కాని నోరాడ లేదు. తనకు అమ్మే కాకుండా ఆస్తి కూడా దక్కింది. న్యాయస్థానంలో ఐనట్లయితే వొస్తే ఆస్తి వొక్కటే వొచ్చేదేమో! అదృష్టం!

—కాని చదువు సంధ్యలూ, సంస్కారంలేని తల్లి; తనను, ఆ వెధవ డబ్బుతోనే కొనుక్కోగలిగిందనే జ్ఞానం, తీవ్రంగా ఆలోచించగల సీనుకు కలగలేదు. తల్లీ కొడుకు లిద్దరూ నిందించిన ఆ వెధవ డబ్బే, తిరిగి వారి రక్త సంబంధాలను స్థిరపరిచేందుకు సహాయపడి, విజయాన్ని పొందిన సంగతే ఇద్దరూ ఆలోచించలేక పొయ్యారు. బైటినుంచి ఇదంతా చూస్తున్న సీను చెల్లెలుకు ఈ ఘట్టానికి తలాతోక లేదని పించటం ఆమె ఆలోచనల లోపమే నేమో?

★